# ఆధారం దొరికింది

## - అడపా రామకృష్ణ

"వీధి తలుపులు కొడుతున్నారు చూడరా చిన్నోడ, మీ నాన్నగారి కోసం ఎవరో ఉదయాన్నే తగలడినట్లున్నారు ముదనష్టపోళ్ళు, వేళాపాలా వుండదు మరి" మనసులోని దుగ్ధ, కోపం భర్త త్రిమూర్తులపై ఎలా చూపాలో అలా విరుచుకుపడి ది సుబ్బమ్మ.

త్రిమూర్తులు గవర్నమెంట్ ఉద్యోగి. పార్ట్‌టైం ఉద్యోగం పెళ్ళిసంబంధాలు చూడటం. మధ్యవర్తిత్వం చేస్తూ గత పదేళ్ళుగా మంచిపేరు సంపాదించుకున్నాడు. ఎన్నిక అబద్దాలైనా క్షణాల్లో మార్చి ఒక్క నిజమే చెవుతున్నా అని సంబంధం ఖాయం చేయగల దిట్ట. ఇరుపక్షాల బాధ్యత తనదే అన్నట్లు అంతా నెత్తిమీదనే పెట్టుకుని కార్యం నడిపించగల సమర్థుడు. ఆయనతో వచ్చిన చిక్కల్లా తనతో పని పెట్టుకున్న వారితో కలసి మొగమాటం లేకుండా వృష్టిగా హోటల్‌లో భుజించడం. మరో అడుగు తీసి అడుగు వేయడు. కాలు కింద పెట్టకుండా అద్దెకారు బుక్ చేయిస్తాడు. మరీ భరించలేని వారితో ఆటో ప్రయాణంతో సరిపెట్టుకుంటాడు. తృణమో, ఫణమో చొక్కా జోబులో పడందే పని పూర్తిచేయడు.

ఈ వ్యవహారాలు చక్కబెట్టడంలో ఉన్నంత శ్రద్ధాభక్తులు చేసే ఉద్యోగం మీదగాని, ఇంట్లో పెళ్ళాం మీద గాని లేవని సుబ్బమ్మ ఎత్తిపొడవని రోజు లేదు. కొడుకులిద్దరి భవిష్యత్తు ఎలా తీర్చి దిద్దాలనే ఆలోచన యింగితజ్ఞానం ఎంతమాత్రం లేదని భర్తని దుయ్యబట్టేది. ఇంట్లో కరువైన మనఃశాంతితోపాటు అన్నింటికి ఇబ్బందులు ఎదుర్కోవడంలో త్రిమూర్తులుకు సహనం పూర్తిగా చచ్చిపోయింది.

భర్తంటే సుబ్బమ్మకు గౌరవం మర్యాద లేక పిల్లలకి తండ్రి మీద భయం, భక్తి లేకపోవడంతో త్రిమూర్తులకు ఇంట్లో ఈగలమోత బయట పల్లకీమోత చందాన పడ్డాడు.

ఏరోజుకారోజు అవసరమైన డబ్బులు, ఇంట్లో అడగ్గానే ఇవ్వడం అలవాటు చేసుకున్న త్రిమూర్తులు ఉద్యోగానికి రెగ్యులర్‌గా వెళ్ళాలని గాని, నెలసరి జీతం తెచ్చి ఇంటి అవసరాలకు ఇవ్వాలనే అవసరం ఏమీ కనిపించలేదు.

త్రిమూర్తులు రోడ్డెక్కితే చాలు అడుగడుగునా దండాలు, షేక్‌హేండ్స్, నవ్వుతూ చేతులూపే వాళ్ళు. గౌరవంగా 'సార్' అంటూ వినయ విధేయలతో సంబోధించేవారు తారసపడతారు.

ఈయన మాటకారితవానికి, సృజనాత్మక శక్తికి, సమయస్ఫూర్తికి ఎవరైనా సరే చిత్తయిపోవలసిందే.

వ్యక్తిగా అయిదడుగుల ఆరంగుళాల పర్సనాల్టీ. తెల్లని శరీరఛాయ. జుట్టు పూర్తిగా తెల్లబడిందేమో గోద్రేజ్ హెయిర్‌డైతో నిత్యనూతన పెళ్ళిపెద్దలా తెల్లని గళ్ళ లాల్చి, పేంటూ, తోలు చెప్పలు, చేతిలో లావుపాటి డైరీతో కనపడగానే అందరికీ ఎంతో మేలుచేసే ఆపద్బాంధవుడిలా , అనాథ రక్షకుడిగా వెంటపడేవారు. అదె త్రిమూర్తుల్లో వున్న ప్రత్యేకత.

త్రిమూర్తులెప్పడు సిగరెట్ పెట్టెగాని, అగ్గిపెట్టె గాని కొనలేదు. అయినా దమ్ముమీద దమ్ము లాగుతూనే వుంటాడు. కిళ్ళీ మీద కిళ్ళీ నములుతూ నిముషానికొక మారు ఎరువురంగులో ఉమ్మేవాడు.

లోయర్ కేడర్ నుండి, మిడిల్‌క్లాస్‌తో హైక్లాస్ సొసైటీ వరకు యువతీ యువకుల ఈడూ జోడూ కుదుర్చుతూ అంచనా వేస్తూ అందరిచేతా భేష్ త్రిమూర్తులుగారు మీరు పూనుకోకపోతే మా అమ్మాయికి ఈ జన్మలో పెళ్ళి అయివుండేది కాదని తెగ మెచ్చుకునేవారు. మా అబ్బాయికి అంత కట్నం వచ్చిందంటే అంతా మీ చలవేనని పొగడ్తలతో ముంచెత్తేవారు. దానికే ఉబ్బితబ్బిబై వాళ్ళు వంద ఇస్తే వంద, వేయి ఇస్తే వేయి అదే పదివేలు అనుకొని సరిపుచ్చుకునేవాడు.

అందరూ త్రిమూర్తులకి సమానమే. ఎదుట వ్యక్తి తనని మోసం చేస్తున్నాడని గాని, తనేవారి మోసానికి గురి అవుతున్నాడని గాని పట్టించుకోడు. ఒకొక్కమారు ఈయన అవసరం తీర్చుకొని పూచికపుల్లలా తీసిపారేస్తూ, ఆఫ్ బాటల్ బ్రాందీతోనో, ఒక చికెన్ బిర్యానీనో సరిపెట్టి మద్యపానీయానికి అలవాట చేశారు అవకాశవాదులు. ఇదిచూసి సుబ్బమ్మ త్రిమూర్తుల్ని బజార్న మీద పడ్డ అంబోతులా జమల, కట్టేసేది. అతని కోసం వచ్చేవారంతా ముదనష్టపోళ్ళే.

త్రిమూర్తులు పర్సనాలిటీకి అంత సీన్ వుంది. ఇంటికి తలువులు తెరవగానే "త్రిమూర్తులు గారున్నారా" అంటూ నడివయస్సున్న ఒకాయన అడిగాడు.

"ఆ వున్నారు... 'అనగానే' కారులో వచ్చాం. అనకాపల్లి ప్రోగ్రామ్ వుందన్నారు. ఏదో మంచి సంబంధం వుందట...' అంటుండగానే వుండండి పిలుస్తాను అంటూ చెప్పింది వినిపించుకోకుండా గదిలోకి వెళ్ళిపోయాడు చిన్నబ్బాయి.

ఇంత పేరు ప్రఖ్యాతులున్న ఆయన వీధిలో 'నేమ్ బోర్డు' అయినా పెట్టుకోలేదు, అంత భేషజం లేని మంచిమనిషి అని అనుకున్నారు అక్కడే నిల్చొని

■ ■ ■ ■ ■ ■ ■ ■ ■


"డ్రైవర్ కారు నెమ్మదిగా పోనీయ్" ఘీంకరించినట్లు కంయ్‌మన్నాడు డ్రైవర్ మీద త్రిమూర్తులు.

తనపక్కనే పెళ్ళికొడుకు తండ్రి రావుగారు కూర్చున్నారు డ్రైవర్ పక్క సీట్లో మరొకాయన బైటాయించారు.

త్రిమూర్తులు హూంకరింపుతో కారు ఎప్పుడైతే స్లో అయిందో, రావుగారు త్రిమూర్తుల వైపు ముఖంతిప్పి చూశారు. చేతిలోని డైరీ ఒకమారు విప్పి చూసి మూసేసాడు.

"మనం పదకొండింటికి సరిగ్గా ఆ ఇంట్లో అడుగుపెట్టాలి. బలమైన ముహూర్తం అదే. ఇంకా టైం వుంది కాబట్టి హోటల్‌లో టీ తాగుతూ మాట్లాడుకుందాం... డ్రైవర్ ఆ రైట్‌సైడ్ హోటల్ ముందు "ఆవుజేయ్" అని ఆర్డరు జారీ చేశాడు తనదైన ధోరణిలో

రావుగారు కారు దిగుతూ "కారులోనే మాట్లా





డుకునే వాళ్ళం కదండి. ఫ్లాస్క్‌లో టీ వుంది, బిస్కట్స్ వున్నాయి" అన్నారు మర్యాదపూర్వకంగా.

త్రిమూర్తులు ముఖంలో భావాలు మారాయి. నాలుగు అడుగులు తనతోపాటు భుజం మీద చేయి వేసి నడిపించుకుపోయి "చూడండి రావు గారు మీకు కొంచమన్నా సమయస్ఫూర్తి లేదండి. మనం ఎన్నో మంచి చెడు మాట్లాడుకోవాలి. డ్రైవర్ అన్నీ వింటాడు. మనల్ని కన్ను గప్పి ఈ డ్రైవర్ని మంచి చేసుకున్నారనుకోండి, మనల్ని బ్లాక్ మెయిల్ చేసి అన్నీ చెప్పేస్తాడు ఇంత శ్రమ వృధా అవునా, ఈ మాత్రం ఆలోచించలేదా మీరు" త్రిమూర్తులు చేతులు, కళ్ళు తిప్పతూ అనర్గళంగా చెప్పేసరికి స్టన్‌అయిపోయారు రావుగారు.

"అబ్బో త్రిమూర్తులుగారు ప్రతీ మూమెంట్ చాలా జాగ్రత్తగా స్టడీ చేస్తారండి. అందుకే మిమ్మల్ని పూర్తిగా నమ్ముకున్నాం. మీరెలాచెపితే అలాగే చేద్దాం" అంటూ ఎంతో నమ్రతగా చేతులు కట్టుకున్నారు.

ముగ్గురూ హోటల్‌లో కూర్చున్నారు.

సర్వర్ వచ్చి ఏం కావాలని అడిగాడు. వెంటనే

త్రిమూర్తులు కల్పించుకొని "మీరు టిఫిన్ చేస్తారా" అని అడిగాడు.

"టీ మాత్రమే చాలు" అన్నారు ముక్తసరిగా

"చూడు వాళ్ళిద్దరికీ 'టీ' స్పెషల్‌గా చేయించు, నాకు ముంధు రెండు వేడి ఇడ్లీ తీసుకురా, ఆ తరువాత ప్లేటు పూరీకూర, మసాలా దోశ ఒకదాని తరువాత ఒకటి పట్రా" హుందాగా ఆర్డరిచ్చాడు. గ్లాసుడు మంచినీళ్ళు ఒక్క గుటకన తాగేసాడు.

రెండువూటల టిఫెన్ ఇప్పుడే ఆరగించెస్తున్నాడ్రోయ్ అనుకున్నారిద్దరూ ఈర్ష్యగా.

"అబ్బాయి ఏం చదువుకున్నాడు ఇంజనీరా, డాక్టరా" టిఫిన్ చేస్తూ అడిగాడు.

"ఇంజనీర్, ఇదిగో సార్ కలర్‌ఫోటో. చామన ఛాయి ఒక్కడే అబ్బాయి. ఆస్తుల్లేవు కాని అమెరికా వెళ్ళాలని పాస్‌పోర్ట్ రెడీ చేసుకున్నాడు. తెలివైన వాడు, పెళ్ళి చేసి పంపాలని తొందరపడుతున్నాం" లక్షణాలన్నీ ఏకరవు పెట్టాడు రావు.

"ఆ తొందరపాటో వద్దండి. మన స్పీడు చూసి వచ్చే కట్నంలో కోత విధిస్తారు ఈ ఆడపిల్లల తండ్రులు. ఏం మాట్లాడినా తూచితూచి, పొసగ దన్నట్లే మాట్లాడాలి. అందచందాలు చూసేటప్పుడు ఊర్మిళలా సన్నంగా వున్నా, రమ్యకృష్ణలా ముఖం తీరుతెన్నులున్నా, సిమ్రాన్‌లా సొగసుకత్తె అయినా, సుస్మితాసేన్, ఐశ్వర్యారాయ్‌లా సుందరాంగులైనా మన అబ్బాయికి తగ్గ అందం, ఈడూజోడూ సరి పోదు అనే అనాలి. పొగడ్తలతో బాగుందని ముఖం మీదే చెప్పేస్తే ఇచ్చే కట్న కానుకలన్నీ సెన్సారుబోర్డు వారిలా కత్తెర్లు పడతాయి. లక్షల నుండి వేలకు కుదించేస్తారు. ఇలా ఎన్నో బెడిసికొట్టాయి కూడా. తరువాత విచారిస్తే ఏమిటి లాభం. పెళ్ళికూతుళ్ళను ఒక మెట్టు కిందకే దించి మాట్లాడాలి. అప్పుడుగాని మన దారికిరారు" త్రిమూర్తులు తన అనుభవాన్నంతా కాచి వడబోసినట్లు చెప్పగానే ఆ ఇద్దరు చిత్తయిపోయారు. ఈయనతో వెళ్తే మన సంబంధం నూటికి నూరుపాళ్ళు లాభసాటే అవుతుందన్న ధృఢమైన నమ్మకం కుదిరింది. ఇద్దరూ తెగమురిసిపోయారు.

టిఫిన్ పూర్తయ్యాక ముగ్గురు కారెక్కారు.

చిన్నపాటి వాన తుంపర్లు మొదలయ్యాయి. కారు అద్దాల మీద వానజల్లుగా పడుతూ తేమ అలుముకుంది. డ్రైవర్ బటన్ నొక్కి వైపర్స్ మూవ్ చేశాడు. అయినా అవి సరిగ్గా పనిచేయడంలేదు. నేషనల్ హైవే రోడ్డు మీద కారు స్పీడ్ అందుకుంది. జంక్షన్ దాటే సమయానికి అడ్డుగా ఇసుక లారీ రావడం డ్రైవర్ గమనించలేదు. స్టీరింగ్ అటూ ఇటూ గాబరాగా తిప్పాడు, సడన్‌బ్రేక్ వేశాడు కారు తడిచిన తారురోడ్డు మీద స్కిడ్డ్ అయి దొర్లింది.

ఆక్సిడెంట్ డ్రైవర్ స్టీరింగ్‌కి నొక్కుకుపోయి ప్రాణాలు వదిలాడు. ఆ ప్రక్కనున్న వారికి ముడుకులు చెక్కుకుపోయాయి, తలకి గాయమైంది. రావుగారికి పక్కటెముకలు చిట్లాయి. కారు తిరగబడుతున్న సమయంలో త్రిమూర్తులు చురుగ్గా డోర్ తెరిచి పైకి గెంతడానికి ప్రయత్నించాడు. అవకాశం కుదరక రెండు కాళ్ళు విరిగి ఎముకలు విరిగి వేలాడిపోయాయి.

■ ■ ■ ■ ■ ■ ■ ■ ■

కొడుకులిద్దరూ తండ్రికి సేవలు చేయడం మొద



## వ్యభిచారిణి పాత్రలో నమ్రత

'వాస్తవ్' అనే సినిమాలో తాను నటిస్తున్న వ్యభిచారిణి పాత్ర కోసం ముంబయ్ లోని రెడ్‌లైట్ ఏరియాలో తిరిగి వాళ్ళు మాట్లాడే బూతులన్నీ బట్టీ వేస్తోంది ఒకప్పటి మిస్ ఇండియా నమ్రతా శిరోద్కర్. పైగా మంచి నటిగా గుర్తింపు పొందాలంటే ఇవన్నీ తప్పవని చెబ్తోంది. కానీ అలవాట్లో పొరపాటు జరిగితే తరువాత వదిలించుకోవడం కష్టమేమో!

## సెక్స్ పుస్తకాలు అక్షయ్ కొనలేదట!

సినిమాల్లోనూ, బయటా తనంటే పడివచ్చే కుర్రపిల్లల్ని వెంట తిప్పకు తిరిగే అక్షయ్ కుమార్ సెక్స్ బొమ్మల పుస్తకాలు గానీ, బూతు సాహిత్యం గానీ కొని చదవలేదట! గట్టిగా అడిగితే ఫ్రెండ్స్ కొని తెచ్చిన పుస్తకాలని మాత్రం పూర్తిగా అయిపోయేవరకు గది తలుపులు తీసే వాణ్ణి కాదని సిగ్గుపడుతూ చెప్పాడు.



లుపెట్టారు. నర్సింగ్‌హోమ్‌లో చేర్చారు. బ్యాంక్‌లో డబ్బంతా ఖర్చు అయింది. అద్దె ఇంట్లో గుట్టుగా సంసారం చేసుకునే సుబ్బమ్మ అద్దె కట్టుకోవడానికే సతమతమయ్యేది. పరుల కోసం జీవితం అంతా ఫణంగా పెట్టి ఇంట్లో అందర్నీ నట్టేట్లో ముంచారని వాపోయింది. రోజులు దొర్లుతున్నాయి. త్రిమూర్తులు లేచి నడిచే అవకాశమే కనపడలేదు. సుబ్బమ్మ నాలుగైదు రోజులు ఆస్పత్రిలోనే వుండిపోయి సేవలు చేస్తూ ఒకరోజు ఇంటికి రాగానే ఆ ఇంటి ముందు పందిరి రాట వేస్తున్నారు. ఇంటిగల ఆవిడ్ని అడిగింది. వాళ్ళమ్మాయికి త్రిమూర్తులుగారు చూసిన సంబంధం కుదిరిందని, కాని ఇల్లు పూర్తిగా వాడుకోవడానికి కాళీ చేయమంది. సుబ్బమ్మ నిశ్చేష్టురాలై తమాయించుకొని బతిమాలింది. భర్త త్రిమూర్తులు ఒంట్లో బాగుపడి తిరిగివచ్చేసిన పిదప వేరే ఇల్లు చూసుకుంటామని, అంతవరకు వేధించవద్దని వేడుకుంది.

త్రిమూర్తులు పరిస్థితి విషమించింది. మందులు పనిచేయడంలేదు. ఒకరోజు తెల్లవారిజామున ఎక్కిళ్ళు ఎగ వూపిరి తీవ్రస్థాయిలో వచ్చి ప్రాణాలు వదిలేసాడు.

నర్సింగ్‌హోమ్ ఛార్జస్ పే చేసి డెడ్ బాడీని తీసుకువెళ్ళమన్నారు. అచోట మమతలు, అభిమానాలు దేనికీ తావులేదు. కొడుకు లిద్దరూ చుట్టాలందరికీ కబులు చేసి ఇంటికి వెళ్ళారు. అక్కడ పెళ్ళి సందడితో హడావుడీగా వుంది. వీరి రాక చూసి అనుమానపడింది ఇంటిగలావిడ. ఇద్దరూ భోరున ఏడ్చారు. ఆమె మాత్రం నిర్మోహమాటంగా "బాబు ఇక్కడ పెళ్ళి, శుభకార్యం జరుగుతోంది. శవాన్ని ఎటువంటి పరిస్థితిల్లో కూడా ఈ దరిదాపుల్లోకి రాకూడదు. అంతా అభాసుపాలవుతుంది" అంది నిష్టూరంగా, నిర్మోహమాటంగా. కొడుకులిద్దరికీ తెలుసు ఈమె కూతురు పెళ్ళి సంబంధానికి ఎన్నిమార్లు తన తండ్రి త్రిమూర్తులు కాళ్ళా వేళ్ళా పడి బతిమాలిందో, ఒక్కపైసా కూడా ఆశించకుండా ఎన్నో అబద్దాలు ఆడి ఈ పెళ్ళి కుదిర్చారు. దుఃఖంతో ముఖం చూపించలేకపోయారు.

నర్సింగ్‌హోమ్‌కి డబ్బు చెల్లించేసరికి సాయంత్రం అయిపోయింది. సూర్యాస్తమయం అయితే శ్మశానంలో శవానికి చోటులేదని నిక్కచ్చిగా కాటికాపరి చెప్పగానే ఇద్దరికీ ముచ్చెమటలు పోసాయి. అటు ఆస్పత్రిలో అట్టేసేపు వుంచడానికి వీల్లేదన్నారు స్టాఫ్. పోనీ అద్దె ఇంటికి చేర్చాలంటే ఇల్లుగలావిడ అల్టిమేటమ్ పాస్ చేసింది. అప్పటికే సాయంత్రం ఐదైంది.

మనిషి జీవితం చాలా విచిత్రమైంది. ఎంతో మందికి ఎన్నో ఉపకారాలు చేసి వాళ్ళ కష్టాల్లో పాలుపంచుకొని ఎంతో మంది వధూవరుల్ని ఒకటిగా చేసి ఎన్నో పొగడ్తలు, అభిమానాలు, ఆదరణ పొందిన వ్యక్తి ఎందుకు కొరగాని వాడిలా పడివున్నాడు. పెళ్ళి సంబంధాల కోసం జీవితం అంతా ధారపోసిన వ్యక్తికి అదే పెళ్ళిపందిరి ఆఖరి క్షణాల్లో వెక్కిరించి ఛీకొట్టినట్లు వెలివేసింది.

చుట్టాలకు కబురు వెళ్ళినా వేళకి రాలేకపోయారు. స్నేహితులకి జరిగింది తెలిసినా ఏవో ఆటంకాలు వలన చేరుకోలేకపోయారు. చివరికి త్రిమూర్తుల విగత శరీరాన్ని ఆస్పత్రి అంబులెన్స్‌లో శ్మశానానికి తరలించారు.

■ ■ ■ ■ ■ ■ ■ ■ ■

త్రిమూర్తులు బ్రతికుండా సంపాదించిపెట్టలేని డబ్బు, దర్పం, హోదా, ఠీవి సుబ్బమ్మకిప్పుడు అన్నీ ప్రాప్తించాయి. భర్త ఉద్యోగరీత్యా గ్రాడ్యుటీ మూడు లక్షలు, ఇన్సూరెన్స్ ఒక లక్ష రూపాయిలు నెలసరి మూడువేలు పెన్షన్, కొడుక్కి ఉద్యోగం సొంత డాబా ఇల్లొకటి కొనుక్కుంది. సుబ్బమ్మ కాస్తా సుబ్బమ్మగారుగా చలామణిలోకి వచ్చింది. ఒకరోజు "ఒరేయ్ చిన్నోడ మన ఇంటిని వెతుక్కుని వచ్చిన వారికి చిరునామా తెలియాలి కదా ఈ బోర్డు వ్రాయించాను. వీధిలో కట్టి వేలాడదీయ్" అంది సుబ్బమ్మగారు ఎక్కడలేని దర్పం ఒలికిస్తూ!

చిన్నబ్బాయి ఆ బోర్డును మేకుకు కొట్టి వ్రేలాడదీసాడు. దాని మీద ఇలా వ్రాసివుంది.

"శ్రీశ్రీ త్రిమూర్తుల వారి సంస్థ"
వధూవరుల వివాహ పరిచయ వేదిక
సంప్రదించడడి శ్రీమతి సుబ్బమ్మగార్ని
మీ ఇంట్లో పెళ్ళి గ్యారంటీ, నేడే కలవండి"!

అది చదివిన కొడుక్కి తల్లి మనసు అర్థం కాలేదు. అయినా బ్రతకడానికి ఏదో ఆధారం దొరికినట్లనిపించింది.